

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



డియర్ రీడర్స్,

పేషంట్లు , హాస్పిటల్ గురించి కాకుండా ఎప్పుడైనా వేరే genre కథ వ్రాయాలని మనసు బలాటపడుతుంది.

దాని ఫలితమే ఈ నెల 'అనగనగా...కథలు'

**చందు శైలజ**

**సంధ్యా సమయమైంది.** రుద్రవర్మకు వివాహం నిశ్చయమైన విషయం అంతఃపురమంతటాతెలిసింది. రుద్రవర్మ తల్లి రాజనందిని తన మందిరం వెనుక వైపు నున్న ఖాళీ ప్రదేశం లోకూర్చుని, దూరాన కనిపించే పర్వతాల వైపు చూస్తున్నది. ఆమె మందిరం నుండి చూస్తే శాంతివనం కనుల విందు చేస్తున్నది. ఆ వనం రాజకుటుంబీకుల విహారాల కొరకు ఏర్పాటుచేయబడింది. అందమైన జలపాతాలు, సరస్సులు, ఎత్తైన వృక్షాలు, పరిమళాలు వెదజల్లేపుష్ప లతలతో నిండి ఆ వనం రాజకుటుంబీకుల విహారాల కొరకు ఏర్పాటు చేయబడింది.

పరిచారికలు ఆమెకు ఉపచారాలు చేస్తున్నారు. అంతఃపురవాసిని వీణ వాయిస్తూ , పాటపాడుతున్నది. పాట సంతోషకరమైనదే కానీ, ఆమె గొంతులో విషాదమే పలుకుతోంది. రాజమాతమనసు సైతం ఆందోళనగా ఉన్నది.

అందుకు కారణం అప్పటి వరకూ జరిగిన సంఘటనలే. జ్ఞాపకాలతో మనసు భారమైంది.

తమ యువరాజులందరూ ఒకరొకరుగా అంతర్ధానమైనారు. వారెక్కడ ఉన్నారో , జీవించియున్నారో లేదో కూడా తెలియదు.

ఆనంద వర్మ వివాహం నిశ్చమైన మరుసటి నాడు, మిత్రులతో వేటకని వెళ్ళాడు. చివరివరకూఅతను తమ వెంటే ఉన్నట్లు మిత్రులంతా చెప్పారు. నగరంలో ప్రవేశానికి కొన్నిక్షణాలముందు, సుడిగాలి వచ్చింది. ఆ సుడిగాలిలో అశ్వాలు తికమక పడ్డాయి. దారి కనబడకఅస్తవ్యస్తంగా నడిచాయి. పెద్దవాడు ఆనంద వర్మ వివాహానికి ముందు , మిత్రులతో కలసివేటకు వెళ్లాడు. అందరూ వచ్చారు తప్ప స్తని రాలేదు . తమతో బాటే చివరకూ ఉన్నాడని, నగరంలో ప్రవేశించే కొద్ది క్షణాలముందు అడవిలో సుడిగాలి ఎండుటాకులన్నీ గాలిలోకిలేచాయని, కొద్ది క్షణాలలో అతనెటు అదృశ్యమయాడో అర్థం కాలేదని అన్నారు.

మంజుల వర్మకు వివాహం అయిన రెండవనాడు ఆ శాంతి వనంలో భార్యతోవిహారానికెళ్లాడు. చల్లని వెన్నెల రాత్రి. వనంలోని పుష్పాలన్నీ విరబూసి విచ్చుకుని మరీ ఆ జంట వంక చూస్తున్నాయి. పరిచారికలు కొద్ది దూరంలో మసలుతున్నారు. పులి గాండ్రింపుకువిస్తుపోయి ఆ వచ్చిన వైపు పరుగు తీశారు. పరివారమంతా చూస్తుండగనే మంజుల వర్మను పులినోట కరచుకుని పరుగుతీసింది. రాజకుటుంబీకులు విహారార్థం ఏర్పాటు చేసిన వనమది. అందులో కుందేళ్లు, జింకలూ తప్ప వేరే మృగాలుండే అవకాశమే లేదు. ఆ పులి ఎటునుండివచ్చిందో ఎటు వెళ్ళిందో ఎవరికి అర్థం కాలేదు. మరునాడు సైనికులు వనమంతా జల్లెడపట్టారు. మంజుల వర్మగానీ, పులి ఆనవాళ్లు గానీ కనిపించలేదు.

మూడవవాడు నరేంద్ర వర్మ. శంబర దేశపు యువరాణిని వివాహమాడి రథం మీదతీసుకుని వస్తుంటే , చిలుకలు వచ్చి రథం మీద వాలాయి. రంగురంగుల చిలుకలు. వాటిఅందానికి, పలుకులకు యువరాజూ, రాణీ ముచ్చట పడి వినోదిస్తుండగా, ఆ రథంఆకాశంలోనికి ఎగిరి మాయమైంది. అది ఎటు వెళ్లిందో, ఏమైపోయిందో ఎవరికీ అంతుబట్టలేదు.

స్వర్ణముఖి శాపవశాన రాజకుటుంబంలో ఏ ఒక్క యువరాజుకూ కల్యాణ యోగం పట్టలేదు. మహారాజు పోయాక ఎవరికీ రాజ్యాధికారం దక్కలేదు. కల్యాణం అయితే తప్ప పట్టాభిషేకంజరగదు. అలా అని వివాహం తలపెట్టగానే, విచిత్రమైన పరిస్థితుల్లో రాజకుమారులు అంతర్థానమైపోయారు.

చివరివాడు రుద్రవర్మ. యుద్ధం పైనున్న ఆసక్తి, దేశ విస్తరణ కాంక్ష వల్ల , ఇప్పటి వరకూవివాహానికి విముఖత చూపాడు.

అతని వల్లనే దేశమూ, వంశమూ నిలబడాలి.

దేశానికి రాజు లేక పోవడం పొరుగు దేశాల వారి ముందు అవమానకరంగా ఉంటున్నా, యువరాజు రుద్రవర్మ కున్న యుద్ధ ప్రీతి వలన కొంత క్షేమమే జరుగుతోంది. మహా యోధుడైనవిజయుడి యుద్ధ ప్రణాళిక వలన గెలుపెపుడూ రుద్రవర్మదేనని తెలిసి, ఏ దేశమూ తమమీదకు దండెత్తి వచ్చే సాహసం చేయడం లేదు.

స్వర్ణ ముఖి , కేశవుల మరణం తరువాత ఆ రాజ్య సింహాసనాన్ని ఎవరూ అధిష్టించ లేదు. ఆమె దుఃఖమే , కాత్యాయినీ దేవి ఆగ్రహమైందని , ఆ ఫలితమే తమ కుటుంబం లో ఏయువరాజూ వివాహానికి గాని, పట్టాభిషేకానికి గానీ నోచుకోలేదని తలచింది. ఆ ఆలోచనతోనేదేవికి పూజలు జరిపించడానికి పంపింది. ఆనాడే, పొరుగు దేశపు యువరాణిని చూసి, వివాహంచేసుకోవడానికి సుముఖత చూపడం ఆమెకు ఆనందం కలిగించినా, వివాహం అయే లోపల ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొన్నది.

రాజకుటుంబంలో యువరాజులను అంతఃపుర స్త్రీలకు దూరంగా పెంచుతారు. వీరు సున్నిత స్వభావులుగా మారకుండా, రాజుగా కొన్ని సందర్భాలలో కఠిన నిర్ణయాలు అమలుపరచడానికి వీలుగా, జాగ్రత్తలు తీసుకునే వారు. చాలా చిన్నతనం నుండే తల్లికి దూరంగాసాగుతుంది వారి జీవితం. ఆ మాతృభావనలు, స్త్రీ సహజమైన లాలిత్యమూ వారిమనసులనాక్రమణ చేయకూడదన్న ఆలోచనతో వారి పెంపకం సాగేది.

అనుభవజ్ఞులైన గురువుల వద్ద కఠిమైన శిక్షణలో రాజ్యనీతి, యుద్ధ కళ గురించినేర్చుకుంటారు.

ఓ నాడు అతడు గురుకులంలో ఉండగా, మహారాజుతో కలసి చూడాలని వెళ్లింది. రాజగురువువద్ద నియమాలు ప్రత్యేకంగా ఉంటాయి. మహారాజు కుమారుడిగా అతనికి ప్రత్యేకసదుపాయాలేమీ ఉండవు. తన పనులన్నీ తనే చేసుకోవాలి. తనను దూరం చేసిందన్న ఆగ్రహించిన రుద్రవర్మ తల్లితో సంభాషించడానికి ఇష్టపడలేదు. రెండవ నాడు రాజగురువు విద్యార్థుల యుద్ధ కౌశల పరీక్షను ఏర్పాటు చేశారు.

అన్నిటికన్నా మిక్కిలి ప్రమాదకరమైన పరీక్ష , ఆకలితో ఉన్న పులి మీద స్వారీ చెయ్యడం. రెండు దినాల పాటు ఆహారమివ్వకుండా ఉంచిన బలమైన తెల్ల పులిని బరిలోకి వదిలారు. ఆపరీక్షలో పాల్గొనడానికి విద్యార్థులందరూ జంకుతుండగా, అందరికన్నా చిన్నవాడైన విద్యార్థిముందుకు వచ్చాడు. ప్రమాదపు స్థాయి ఎరుగని పసివాడని తలచి, మహారాజు, రాజనందినివలదని వారించబోయారు. నిశ్చింతగా ఉండమని సూచించాడు రాజగురువు.

లోపలికి వెళ్లిన ఆ విద్యార్థి కొన్ని క్షణాలపాటు నిబ్బరంగా నిలబడి, దాని వంక తీక్షణంగాచూశాడు. పులి వైపు చూసిన అతని చూపులలో తీక్షణతకు మహారాజు సైతం నివ్వెరపోయాడు. పులి వెనకడుగు వేసింది. అది కొద్దిగా వెనుకకు తగ్గాక, ఆ విద్యార్థి దిక్కులన్నీ కంపించేలా ఒకకేకవేసి, ముఖంలో తీవ్రమైన వైఖరిని ప్రదర్శించాడు. పులితో బాటు అందరూ ఉలికి పడ్డారు.

అతని తీరుకు పులి వెనుకకు అడుగులు వేస్తూ, నక్కడానికి ఒక మూలకు వెళ్లింది.

అతను పులిని నిలువరించి, స్వాధీన పరచుకోవడం , ఆపైన లాఘవంగా దానిమీద కూర్చుని, ఆహారమున్న వైపుకు తరలించడం , కొద్ది క్షణాలలోనే దానిపై ఆధిపత్యం సాధించిన వైనంమహారాజుని అబ్బుర పరచాయి. అదెలా సాధ్యమైనదో మహారాజుకు అవగతం కాలేదు.

అతడి చేతిలో గరుడ రేఖ ఉన్నదనీ, అది ఉన్నవారిలో ధైర్యం , సాహసం సహజలక్షణాలవుతాయనీ ,అతడు చెంతనుంటే విజయం తథ్యమనీ తెలియ పరచాడు. అంతేకాకుండా క్రూర మృగాలు, విషసర్పాలు అతడిని చూసి సహజంగానే భయపడతాయని, అదృశ్య శక్తులు అతని దరి చేరవనీ వివరించాడు రాజ గురువు.

అతడు ఏ దేశపు రాజకుమారుడో తెలుసుకోవాలనుకున్నాడు మహారాజు.

అతడు అడవిలో ఒక శిధిలాలయం వద్ద పసిబిడ్డగా దొరికాడని ఆనాటి నుండి విజయుడన్నపేరుతో తనవద్దే పెరిగాడనీ, చెప్పాడు రాజగురువు.

విద్యాభ్యాసం అయిన తరువాత రాజ్యానికి వచ్చాడు రుద్ర వర్మ. అతనితో బాటే విజయుడుకూడా. తల్లిని కలుసుకోవడానికి రాజనందిని మందిరానికి వచ్చాడు. రుద్రవర్మను ఏనాడోచిన్నతనంలో చూసిన జ్ఞాపకం. కుమారుడిని చూసి ఆనందం కన్నా, దుఃఖంవచ్చింది. సోదరులు ఎలా మరణించారో అడుగుతాడని ఆశించింది. చిన్నతనంలో తన ప్రేమకు దూరమైనాడు. ఇప్పుడు ప్రేమ కనబరచాడిని వీల్లేనంతపెద్దవాడైనాడు.

అప్పటికి అతడిని చూచి ఎన్నో ఏళ్లు గడిచాయి. తల్లికి నమస్కారం చేసి నిలబడ్డాడు. అపరిచితులవలె అభివాదం చేసుకున్నారు. అతను తనను వదిలి వెళ్లిన చిన్న బిడ్డకాదు. ఎత్తుగా ఎదిగి యవ్వనంలో అడుగిడిన యువకుడు. వీరుడిలా అగుపించాలన్న సంకల్పం ముఖంలో తెలుస్తున్నది. యువరాజు అలంకారాలతో సుందరుడిలా ఉన్నాడు. మరింత సేపు చూడాలని కోరుకున్నది కానీ, తేరిపార చూడడం రాజమాతకు తగదని అతడిని ఆశీర్వదించి పంపించివేసింది.

రాజమాత స్థానానికి భంగం రానీయకుండా అమె తన కన్నీరు దాచుకోగలిగింది. ఎన్నోసంవత్సరాల శిక్షణ, అనుభవం ఆమెకుపయోగపడ్డాయి. ఉద్వేగాలు దాచుకోవడంరాజాకుటుంబీకులలో ముఖ్య లక్షణం. వారు దుఃఖానికి, వేదనకూ అతీతులుగా కనిపించాలి.

ఎనాటినుండో నిలవచేసిన ప్రేమ ఇప్పుడు కొరగాకుండా ఉన్నది.

హృదయం భారమయేదీ, వేదన తెలిసేదీ , అందులో నిలువుండిపోయిన ప్రేమవల్లనే.

రుద్రవర్మకు రక్షణగా విజయుడిని నియమించాడు మహారాజు. విజయుడు వచ్చినతరువాత చేసిన ప్రతి యుద్ధమూ విజయవంతమైంది. యుద్ధప్రణాళిక తయారుచేయడంలో అతని ప్రతిభకు మహారాజు విస్మయం చెందేవాడు. అతి తక్కువ ప్రాణ హాని కలిగేలా యుద్ధవ్యూహం రచించేవాడు. దేశ విస్తరణ కొరకు రుద్రవర్మ తలపెట్టిన ప్రతి యుద్ధంలోనూ విజయంసంభవించింది.

ఆ నాటి ఆ వివరాలు , మరణించే సమయంలో మహారాజు చేసిన హెచ్చరిక రాజనందినికి జ్ఞప్తికివచ్చాయి.

పుత్రులందరూ మరణించాక మహారాజు దిగులుతో కృశించిపోయి ఉన్నాడు. అంతిమగడియలలో రాజనందినికి కొన్ని జాగ్రత్తలు చెప్పి మరణించాడు. రుద్రవర్మకు విజయుడుతోడుగా అన్ని వేళలా ఉండాలన్నది మహారాజు ముఖ్యమైన కోరిక.

రుద్ర వర్మ వివాహానికి సుముఖుడు కావడంతో సంతోషం కన్నా మించి ఆమెలో ఆందోళనపెరిగింది. వివాహం జరిగే లోపున ఏమవుతుందోనన్న ఆలోచన ఆమెను కలవర పెట్టింది.

రాజగురువుకు కబురు చేసిందామె.

రాజ గురువు వృద్ధుడైనాడు. రాజనందిని కబురందుకుని ఆమె మందిరానికి విచ్చేశాడు.

యువరాజులు అదృశ్యమైన విషయమూ, ఎవరికీ వివాహం కానీ , పట్టాభిషేకయోగం గానీ కలుగనివిషయం తెలిపి ఖిన్నురాలైంది.

రాజ గురువు ఆమెను అనునయించాడు. " స్త్రీ సౌభాగ్యాన్ని కాపాడడంలో కాత్యాయినీ దేవి ప్రత్యేకమహిమ గల దేవత. కాబోయే వధువు చేత సుమంగళి వ్రతం ఆచరింపచేస్తే మంచిది . నవరాత్రుల పాటు ఆ దేవి ఆలయంలో ఆమె చేత వ్రతమాచరింప జేయాలి. వ్రతం అయినమూడు రోజులకు వివాహం జరిపించండి. అది కూడా కాత్యాయినీ దేవి ఆలయంలోనే జరగాలి" అని తెలిపాడు.

వెళ్లబోయే ముందు రాజనందినికి మరొక హెచ్చరిక చేశాడు.

"అంతే కాదు. వివాహమయే వరకూ రుద్రవర్మ గానీ, వధువు కానీ బయట సంచరించకపోవడంమేలు. ఒకవేళ వెళ్లవలసి వస్తే, విజయుని తోడు లేకుండా పంపవద్దు."

ప్రతి దినం వ్రతమాచరించడానికి వసంత చంద్రిక ఆలయానికి వచ్చేది. ఆమెకు రక్షణగా ఆలయం వద్ద అప్పటి వరకూ, నిలబడి ఉన్న విజయుడు ఆమెపై తన అనురాగంమాయమైపోవాలనీ, తాను పూర్వపు విజయుడి వలె యోధునిగా జీవించాలనీ, వివేకంతో ప్రవర్తించాలనీ కోరుకునే వాడు.

ఏ స్త్రీ అయినా రాణి అయే అవకాశాన్ని కాదనుకోదు. ఒక సామాన్య సైనికుడికి భార్యగా కావాలనికలలు కనదు. ఆమెను మరచిపోవడమే మంచిదని మనసు అతనికి ఎంతగానో నచ్చ జెప్పేది.

అతడు కూడా ఒప్పుదలకు వచ్చినట్లే ప్రశాంతంగా ఉండేవాడు. ఆలయ సమీపానికి పల్లకి

వచ్చి ఆగగానే, తెరల ముత్యాల వరుసలు ఊగుతూ ఉండగానే, మనసు వేరే దారినసాగిపోయేది. అప్పటివరకూ సాధువులా ఆలోచించే హృదయం అతని ఆధీనంలోనుండితప్పుకుని, ఆమె కోసం పలవరించేది. ఆమె పాదాలను చూసిన మరుక్షణం గుండె చప్పుడుపెరిగేది. ఆమె అడుగులే అతని హృదయ స్పందనలయేవి.

ఆమెను ఆరాధించని జీవితం తనకవసరం లేదని మనసు మొండికెత్తేది.

ఆమెను స్వంతం చేసుకోవాలని నిస్సంకోచంగా ప్రేరేపించేది. ఈ సందిగ్ధంలో ఆమెను చూసినప్రతి రాత్రీ నిద్ర కరువయేది. ఆ చిత్రమైన హింస అనుభవిస్తూ , పరితపిస్తూ ఆహారంతినలేకపోయేవాడు. ఆమె సన్నిధి కోసం , సాన్నిహిత్యం కోసం అంతరాత్మ అనంతంగా వ్యధచెందేది. రాతి మిద్దె మీద నక్షత్రాలూ, వెన్నెలా అతని వ్యాకులపాటుకు జాలిపడేవి. ప్రకృతిఅతనికి తోడుగా నిలబడి ఓదార్చేది.

ప్రతి సాయం సమయం, ఆమె ఆలయానికి వచ్చే క్షణం కోసమే నిరీక్షిస్తూ ఉండేవాడు. ఎదురుచూసే ప్రతి క్షణం తనని తాను నియంత్రించుకోవాలని శత విధాల ప్రయత్నించేవాడు. ఆమె కాబోయే మహారాణి అనీ, తనలాంటి సామాన్యుడికి దక్కని అద్భుతమని, మనసునినిగ్రహించుకోవాలని ఎన్నో ఆలోచనలు చేసేవాడు.

నవరాత్రులు గడిచాయి. చివరి దినం ఆమె దేవాలయంలో ప్రదక్షిణలు చేస్తోంది. ఆసమయంలో కంటి సైగతో చెలికత్తెలను ధ్వజ స్థంభం వద్దే ఆపేసింది. సాయం సంధ్యవెలుగులో ఆకాశం ఎర్రబడింది. ఆమె లేత హరిత వర్ణపు దుస్తులలో వనరాణిలా నడచివెళుతోంది.

ఆమె అడుగులు వెంట అనుసరించిపోవడమొక ధ్యానంలా సాగుతున్నాడు విజయుడు.

ఉండి ఉండి వెనుకకు తిరిగి చూస్తోంది. కనురెప్పల క్రిందుగా తనను గమనించి, వెంటఉన్నాడని నిర్ధారించుకుని మళ్లీ అడుగులు వేస్తున్నది. ఆమె క్షణకాలపు చూపుకే సైతంహృదయం పరవశం చెందుతున్నది. ఉత్సాహం నింపుతున్నది.

హృదయం అనుభవిస్తున్న ఉద్వేగం మునుపెన్నడూ అనుభవం కాలేదు.

తన స్త్రీకి తోడుగా నడుస్తున్నట్లున్నది తప్ప , ప్రభువుకు కాబోయే భార్య అన్న ఆలోచనేదరికి రానంత మైకంలో ఉన్నది అతని మనసు. ఆమె అడుగులకు ఆభరణాల సవ్వడులు, వస్త్రాల గుసగుసలు , అతన్ని వేరే లోకం లోకి నడిపించుకుని పోతున్నాయి. ఆమెసాన్నిహిత్యంతో వివశుడినవుతున్నానన్న స్పృహ మెరుపులా తెలిసి మరుక్షణంలోమాయమవుతోంది. ఆమె అడుగుల సవ్వడికి తనలో కలిగే స్పందనలు నియంత్రించుకోవడానికిశ్రమపడవలసి వస్తున్నది. ఈ చిత్రమైన బాధ ఎన్నడూ అనుభవంలోకి రాలేదెందుకని ఆశ్చర్యపడ్డాడు. ఇదివరకెంత హాయిగా గడిచేది కాలం. విధి, రాజ్యం, యుద్ధం. బాధ లేని లోకంలోజీవించాడు.

'ఈమె ఎవరు.'

'ఎందుకిలా బాధిస్తున్నది.'

'కాబోయే మహారాణి. ఆమెపై మనసెందుకు?'

'మరల్చుకుందామంటే, మనసు ఆమె తనకోసమే నంటుంది.'

అనుక్షణం హృదయాన్ని కోస్తున్నంత బాధ.

అడుగులననుసరిస్తూ కొంత దూరంలో నడుస్తూ ఉన్నాడు.

ఇంతలో చంద్రిక చీరకొంగు గాలికెగిరి పక్కనే ఉన్న వృక్షానికి చిక్కుకుంది.

ఆమె ఆగిపోవలసి వచ్చింది. చిక్కుకున్న కొమ్మ నుండి తప్పించ బోయింది. అది ఎత్తుగాఉండడం వల్ల ఆమెకు అందడం లేదు.

ఆమె పాదాలనే అనుసరిస్తున్న విజయుడికి జరిగినదేమిటో అర్థం కాలేదు. ఆమెకు దూరంగానిలబడి చూస్తూ ఉన్నాడు. అతనిలోని నిర్లిప్తత, ఆమెలో ఆశాభంగమైంది. ఆమెకు తెలియకుండానే రోషం తో ముఖం ఎర్రబడింది.

ఆమె పూలు కోయాలని ప్రయత్నిస్తున్నదని తలచి, దగ్గరకు వచ్చి,

"పూలు కావాలా మహారాణి"?" అంటూ కొమ్మ వంచాడు.

చీర చిక్కుకోవడం గమనించి, దాన్ని కొమ్మ నుండి తప్పించి ఆమె చేతికివ్వబోయాడు. ఆమె కోపంతో అతని చేతినుండి గట్టిగా లాగింది. ఆమె విసురుకు చీర చిరిగింది. అది చిరిగిపోవడం చూసి, అతను నొచ్చుకున్నట్లు

"కాబోయే మహారాణికి కోపం తెప్పించానా?" అని ప్రశ్నించాడు.

"మహారాణి , మహారాణి! నాకేమీ వద్దు."

"నేను సామాన్యుడి భార్యగా ఉండాలనుకుంటున్నాను."

"రాణివాసం వదిలి సామాన్యుడితో జీవితం ఎందుకు?"

"నాకు జీవితమే వద్దు." విసురుగా వెళ్లబోయింది.

"ఇంత సుకుమారికి అంత ఆగ్రహమా."

ఆమెను ఆపాలని చేయిపట్టుకున్నాడు.

"ఆగ్రహం కాదు. నా మనసునీ, తనువునీ తాకిన వీరుడితోనే నా జీవితం. మనసు తెలుసుకోలేని మూర్ఖుడిని కోరుకున్నందుకు దుఃఖం." చేతులలో ముఖంకప్పుకుంది.

ఆమె నిందావాక్యాలు చల్లని పన్నీటి జల్లులా తాకాయి. ఆమె మనసు తెలిసిన అతనికి అన్నిలోకాలనూ జయించిన భావన కలిగింది. సంతోషం సముద్రాలు పొంగిపోయాయి.

"దేవీ, మనసు తెలుసుకోలేని మూఢుడిని ".

ఆమె చెక్కిళ్లపై జారిపోతున్న కన్నీరు తుడిచాడు.

ఆమె కేశాలను సవరిస్తూ నిలబడ్డాడు. ఎంతకాలం గడిచిందో తెలియదు.

మొదటి సారి భయంతో దగ్గరైంది.

రెండవ సారి విరహం తాళలేని దుఃఖంతో దగ్గరైంది.

ఇక ఎప్పుడూ ఆమెను బాధపెట్ట కూడదు. తనకో జీవితమున్నదని మొదటి సారి తెలుస్తున్నది. దానికో లక్ష్యం కనిపిస్తున్నది.

ఆమె సాన్నిహిత్యంలో ఆనందం తన స్వంతం కావాలి. ఆమెను సంతోషపెట్టాలి. ఇంతకు మించిన లక్ష్యం లేదు. ఆ దేవి తనకొసగిన వరం ఆమె.

" అవివేకిని మన్నించు."

అతని పెదవులపై వేలు ఉంచింది.

"నిన్ను చేపట్టే మార్గం చూసుకుని వస్తాను." ఆమెకు బాస చేశాడు.

వెన్నెల వెలుగులో గురిచూసి సంధించిన బాణాలకు గాయపడిన వారిద్దరూ , కోలుకుని విడివడడానికి సమయం పట్టింది.

చంద్రుడు, వెన్నెలా, నక్షత్రాలే కాకుండా వేరొకరెవరో కూడా చూసేందుకు అవకాశమిచ్చారు.

అతనిని వదిలి వెళ్లిపోతూ, ఆ వేలితో అతని పెదవులపై మెత్తగా స్పృశించి వెళ్లిపోయింది. ఆ ప్రేమలేఖ పుట్టించిన అగ్నికి నిలువునా రగిలిపోయాడు విజయుడు.

సంతోషం కెరటంలా లేచింది. ఉద్వేగం వేగంగా ప్రవహిస్తున్నది.

ఆ సాయం సమయం, విజయుడిని వ్యాహ్యాళికి పిలిచాడు రుద్రవర్మ.

రాజమందిరానికి ఉత్తర దిక్కులో ఉన్న వనంలో సంచరించడం అతని అలవాటు. తరచూవిజయుడిని కూడా ఆహ్వానించేవాడు. అలా నడుస్తూనే పొరుగు దేశాలపై ఆక్రమణకు కొన్నివ్యూహ రచనలు సిద్ధం చేసేవారు.

ఈ పర్యాయం విజయుని ఆహ్వానించిన విశేషం వేరు.

ఇరువురూ కొద్ది సమయం పాటు మౌనంగా నడిచారు.

ఇరువురి మనసులోనూ వేరు వేరు ఆలోచనలు సాగుతున్నాయి.

యువరాజుకు విషయం ఎలా తెలపాలి, తమ ప్రేమ గురించి తెలిస్తే , అతనెలా స్పందిస్తాడు. అని ఆలోచిస్తున్నాడు విజయుడు.

"విజయా, ఇన్ని దినాలు వ్యాహ్యాళికి రాలేదు. రాజమాత వేరే పని మీద పంపినట్టున్నారు." మందహాసంతో ప్రశ్నించాడు.

"అవును యువరాజా, ఆలయంలో రక్షణ ఏర్పాట్లు చూడమని పంపారు."

వసంత చంద్రికను ఎలా పరిణయమాడాలో ఒక ఆలోచన లేదు. ఒక వ్యూహమూ లేదు. యువరాజు తో బాటు ఉద్యానవనంలో కాలిబాటన నడుస్తున్నాడు. యువరాజు చాలా ఉల్లాసంగాఉన్నాడు. తండ్రి ఇచ్చిన సామ్రాజ్యాన్ని రెండింతలు చేశాడు. దానిలో ముఖ్యమైన పాత్రవహించిన విజయుణ్ణి అభినందించాడు.

“ఎందరో రాజకుమార్తెలను చూచాను విజయా. ఎవరిని చూసినా కలగని భావన వసంతచంద్రికను చూడగానే కలిగాయి. నాతో పాటు సింహాసనం పై కూర్చుండగల అర్హత ఆమెకేఉన్నదని నా నమ్మకం. ఏమంటావు విజయా.”

విజయుడేమీ మాట్లాడక మౌనంగా ఉన్నాడు.

“విజయా, ఆమెను చూడాలని ఎంతగానో మనసు పరితపిస్తున్నది. కానీ వివాహం వరకూచూడకూడదని రాజమాత ఆజ్ఞాపించారు. ఆమె ఎలా ఉంటుంది. ఏమైనా వివరాలు చెప్పువిజయా. తెలుసుకోవాలని ఉంది.”

“యువరాజా. నేనెలా చెప్పగలను.” నిర్లిప్తంగా అన్నాడు. రుద్రవర్మ వసంత చంద్రిక గురించిప్రశ్నిస్తుంటే, మనసులో అసౌకర్యంగా అనిపిస్తున్నది.

“నీకా? నీకెలా తెలుస్తుందిలే. స్త్రీ పట్ల, ప్రేమ పట్ల ఆసక్తి లేదు. వనంలో విందు ఏర్పాటు చేశారు. పద” అంటూ విజయుడిని పు తీసుకుని వెళ్లాడు రుద్రవర్మ.

కొలను పక్కనే అంతఃపుర పరివారం ఉన్నారు. వెన్నెల విరబూసింది. రుచికరమైనఆహారపదార్థాలన్నీ అమర్చి ఉన్నాయి. అరుదైన ఫల రసాలున్నాయి.

విజయుడికి ఆహారం మీద మనసు రావడం లేదు.

యుద్ధ వ్యూహాలు రచించడమే అంతవరకూ తెలుసు. ప్రేమ యుద్ధం ఎలా చేయాలో, ఎలాజయించాలో అని ఆలోచిస్తూ ఉన్నాడు. ఒకవేళ ఆమెను పరిగ్రహించకపోయినట్లైతే, ఆమెఎంతగా దుఃఖిస్తుందో, ఆ వేదన ఎలా ఉంటుందో ఊహించుకోగలిగాడు.

ఆమె మాత్రమేనా?

‘ఆమె దూరమైతే తను మాత్రం జీవించ గలడా? ఆమెను దక్కించుకోలేని జీవితం కూడా ఒకజీవితమేనా?’

యువరాజు ఎదురుగా ఉన్నాడని మరచి, ఆలోచనలెటో సాగుతున్నాయి. విజయుడి వైఖరిగమనించి, “నా వివాహం నిశ్చయమైనందుకు నీకు సంతోషంగా లేదా విజయా. ఆమె గురించితెలుసుకోవాలనుకుంటున్నాను. చెప్పు.”

అంటూ ఒక పానీయాన్నందించాడు. యువరాజు అందించిన పానీయం తాగుతూ ఉన్నాడు. అది ఎన్నడూ లేనంత మత్తెక్కిస్తున్నది. ఎక్కడో తేలిపోతున్నట్లు, మనసు తన వశంలోలేనట్లున్నది. తానేమి మాట్లాడుతున్నాడో ఏదీ తన ఆధీనంలో లేనట్లున్నది. మౌనంగాఉండాలనుకున్నాడు. సాధ్యం కాలేదు.

మనసులో బాధ, ప్రేమ, ఆమె పట్ల అనురాగం అంతా తనకు తెలియకుండానేతెలియజేస్తున్నాడు.

“యువరాజా, ఆమె నా ప్రాణం. ఒకరినొకరం గాఢంగా కోరుకుంటున్నాము.”

రుద్రవర్మ కన్నులలోని రౌద్రానికి ముఖ్య సమాచారం చేరవేసిన వేగులు జంకి వెనకడుగువేశారు.

వివాహానికింకా సమయమున్నది కానీ, ఆనాడే వివాహానికి ఏర్పాట్లు చేయమని ఆదేశించాడు రుద్రవర్మ. రాజనందిని, కుమారుడి ఆతృత ను వేరే విధంగా అర్థం చేసుకుంది.

ఉదయం నుండీ విజయుడి కొరకై నిరీక్షిస్తున్నది వసంత చంద్రిక. అతడు తప్పకవస్తాడని, తనని చేపడతాడనీ ఆశగా ఎదురుచూస్తోంది. కాలం గడుస్తున్నది.

క్షణ క్షణానికీ ఆతృత హెచ్చవుతున్నది. చిన్న సవ్వడికి కూడా ఉలికిపడి విజయుడేమోననిలేచి పరికిస్తున్నది. ఆమె వెంట ఉన్న చెలికత్తెలందరికీ ఆమె ఎవరికోసం ఎదురు చూస్తున్నదోతెలిసి, విచారంగా అలంకరిస్తున్నారు.

ఇంతలో రాజనందిని వధువుకోసం రాజకుటుంబానికి చెందిన ప్రత్యేకమైన ఆభరణాలుతీసుకుని వచ్చింది.

ఆమె వసంత చంద్రికను చూసింది. ఆమె సౌందర్యానికి విస్తుపోయింది. మానవుల్లో అటువంటిఅరుదైన అందం ఆమె మునుపెన్నడూ చూడలేదు.

ఆమె కాబోయే కోడలికి తెచ్చిన రాజకుటుంబానికి చెందిన రత్నాభరణాలను ఒకటొకటిగాఅలంకరించమని చెప్పి, , పరిచారికలు అలంకరిస్తుంటే ఆమె ముచ్చటతో పరికిస్తూ ఉన్నది.

ధగధగలాడే ఆభరణమేదైనా వసంత చంద్రిక శరీరం పై కాంతివిహీనంగా అగుపిస్తున్నది.ఆమెను చూడడమే కనులకు విందుగా అనిపించింది. ఎంత చూసినా తనివి తీరడం లేదు.ఈమె జన్మ సాధారణమైనది కాదని ఆమెకు తోచింది.

ఆ రూపలావణ్యాలను చూస్తూ మైమరిచి పోయింది. అద్భుత సౌందర్యాన్ని చూస్తూ ఉన్నరాజనందినికి ఎప్పటికో ఆ అందంలో ఒక లోపం స్ఫురించింది.

ఆమె సౌందర్యవతియే. కానీ ఏమిటా లోపం.

వసంత చంద్రిక మోములో సంతోషం లేదు.

ఆమె ముఖంలో చిరునవ్వు లేదు. మనసెక్కడో ఉన్నదని స్పష్టంగా తెలుస్తున్నది. వివాహంకాబోయే వధువుకుండాల్సిన కలవరపాటుగానీ ఉద్వేగంగానీ, ఎటువంటి సంతోషపు ఛాయలుకనిపించడం లేదు. వధువుగా చేసిన అలంకారం , అంతటి సౌందర్యవతి పట్ల అనాసక్తిగాఉన్నట్లనిపించింది. ఆమె మీద అలంకరించిన ఆభరణాలన్నీ నిర్లిప్తంగా ఉన్నాయి.

కారణమేమైయుంటుందీ అని రాజనందిని ఆలోచిస్తూ ఆమె వైపు వెళ్లబోతుండగా, వధువునితీసుకుని రమ్మని కబురు వచ్చింది. పరిచారికలు వెంటరాగా వసంత చంద్రిక ఆలయం వైపువెళ్లింది. ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉన్నది. వెనుక వైపునున్న నీల సిందూరవృక్షాలకు నమస్కరించింది. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే వృక్షాలు మౌనంగా, స్తబ్ధంగా నిలబడిపోయినట్లున్నాయి. కన్నీళ్లతో తల పైకెత్తి చూసింది. ఆమె ప్రణమిల్లుతున్నదిఅనుకుంటున్నారు వెనుక నిలబడిన పరివారం. మరికొంత దూరంలో రాజనందిని ఆమెనేచూస్తూ ఉన్నది.

ఇతమిద్ధంగా తెలియని బాధ ఏదో రాజనందినిని కూడా ఆవరించింది.

'ఏమిటామె బాధ?'

ఆమెతో సంభాషించకుండానే ఈ వివాహం నిశ్చయించినందుకు తనను తానునిందించుకున్నది.

ఏమి చేయాలో , ఇంకా కొన్ని క్షణాలలో వివాహ క్రతువు ప్రారంభమవుతోంది.

వెనుకకు తిరిగి చివరి సారి విజయుడి కోసం పరికించి చూసింది.వెనుకకు తిరిగి రాజనందినివైపు చూసింది. ఆమె చూపులో కనిపించిన భావానికి రాజమాత విస్తుపోయి, పరుగున ఆమె వైపువెళ్లబోయింది. రాజనందిని ఆమెను చేరుకునే లోపు వసంత చంద్రిక ఆ రెండు వృక్షాల మధ్యాఉన్న ప్రదేశంలో లోయ లోనికి దూకింది.

వెనుక నుండి చూస్తున్న రాజ పరివారమంతా నిర్ఘాంత పోయారు. కొందరు కేకలు వేశారు. రాజనందిని పరుగున లోపలికి వెళ్లి రుద్రవర్మతో చెప్పింది.

యువరాజు ఆందోళనగా వసంత చంద్రిక లోయలోనికి అదృశ్యమైన ప్రదేశానికి వచ్చి చూశాడు. ఆ లోయ ఎంతో అపాయకరమైనది. విష సర్పాలతో నిండి ఉంటుందని ప్రతీతి.

"రుద్రా, చూస్తావేం, వెళ్ళి ఆమెను రక్షించు." అన్నది.

"ఆ లోయ ఎంత అపాయకరమో మీకు తెలియనిది కాదు." తల్లితో చెప్పాడు రుద్రవర్మ.

రుద్రవర్మ వైపు అపనమ్మకంగా చూసింది.

" స్త్రీ ఆపదలో ఉన్నది రుద్రా."

"అది ఆమె కావాలని తెచ్చుకున్నది. వారి అవివేకానికి మనమెలా బాధ్యులం."

"తన స్త్రీని రక్షించుకోవడం ధీరుడైన పురుషుని విధి.

విధి నిర్వహణ సమయంలో అపాయాలనెంచుతున్నావా రుద్రా?"

"నాతో వివాహానికన్నా, మృత్యువునే కోరుకున్నదంటే, ఆమె నా స్త్రీ ఎందుకవుతుంది. ఆమెకోసంనేనెందుకు అపాయం కోరి తెచ్చుకోవాలి?"

"దేశాన్నేలే రాజుగా , ఆమెను కాపాడు. నీ సైనికులనెవరినైనా పంపించు."

తల్లిమాటలు రుచించనట్లు నిలబడ్డాడు.

అతనితో వాదన అనవసరమని తలచి, చుట్టూ చూసింది. యువరాజుని కాదనిసాహసించేవారెవరూ లేరక్కడ.

"విజయుడెక్కడా?"

ఎవరూ మాట్లాడలేదు.

"విజయుడేడి రుద్రా?"

రుద్రవర్మ మౌనంగా నిలబడ్డాడు. విజయుడెప్పుడూ రుద్రవర్మతో బాటే కనిపించేవాడు. అదీఇంత ప్రత్యేకమైన దినాన అతడెందుకు లేడు. ఏదో అపస్వరం వినిపించింది. అతను తోడులేనినాడు , రుద్రవర్మ ఆపదలో ఉంటాడని మహారాజు చేసిన హెచ్చరిక గుర్తు వచ్చింది.

"రుద్రా , ఏమిటిది. విజయుడెక్కడా?"

రుద్ర వర్మను ప్రశ్నించింది. యువరాజు మౌనంగా నిలబడడం ఆమెకేదో సంశయాన్ని రేపింది.

"విజయుడిని వెంటనే ప్రవేశపెట్టండి. మహారాణిగా ఆజ్ఞాపిస్తున్నాను." ఆమె ఆగ్రహంగాపలికింది.

ఆమె కంఠంలో వినిపించిన ఆగ్రహానికి రుద్రవర్మ వెంటనే కదిలి సైనికులకు సంజ్ఞ చేశాడు.

కొద్ది సేపటికి బలమైన గొలుసులతో బంధించియున్న విజయుడిని తోడ్కొని ఆలయప్రాంగణానికి వచ్చారు.

విజయుడి కన్నులు ఎరుపెక్కి ఉన్నాయి. ఎన్నో నాళ్ళ నిద్రకు కరవైనట్లు. అతడిని చూడగానేరాజనందిని విజయుడికి చేరువగా వచ్చి, "ఏమైంది విజయా. ఏం నేరం చేశావు. ఎవరు నిన్నిలాశిక్షించింది." ఆతృతతో ప్రశ్నించింది.

అతడేమీ బదులు పలకలేదు.

"విజయా, ఏమిటిదింతా. నిన్ను బంధించడమేమిటి? అతని బంధనాలు విప్పండి." అన్నది.

సైనికులు వచ్చి గొలుసులను విప్పబోయేలోపల విజయుడే తన శరీరాన్ని ఒక ప్రత్యేకమైన కోణంలో కుదించాడు. ఒకటి రెండు నిముషాల్లో గొలుసులన్నీ జారి అతని ముందు కుప్పగాపడ్డాయి.

"ఏమిటిది విజయా. నీవు నేరం చేశావంటే నమ్మలేను. ఏమి జరిగింది?"

ఒక క్షణం మౌనం తరువాత, "మేమిద్దరం ఒకరినొకరం కోరుకున్నాం." అన్నాడు. ఎవరు ఎవరినికోరుకున్నారో , వసంత చంద్రిక ముఖంలో సంతోషం ఎందుకు లేదో , వివాహానికి ముందు ఆమెమృత్యువు వైపు ఎందుకు నడిచిందో మహారాణికి అర్థం అయింది.

చుట్టూ చూశాడు విజయుడు. వసంత చంద్రిక ఎక్కడా కనిపించలేదు. అతని చూపుల్లోనిఅన్వేషణ పసిగట్టింది రాజనందిని.

ఇదివరలో మహారాజు చేసిన పొరపాటే ఇప్పటివరకూ వెంటాడుతున్నది. అది మరలపునరావృతం కావడానికి వీల్లేదు అనుకుంది.

“విజయా, ఇప్పటి వరకు నీకోసమే నిరీక్షించింది. నీవు రానందుకే, చంద్రిక ఆ లోయలోకిదూకింది. ఆమెను కాపాడు.” ఆందోళనతో చెప్పింది.

పరుగున వెళ్లి లోయలోకి చూశాడు. దట్టమైన వృక్షాలు తప్ప అంతా చీకటిగా ఉన్నది.

ఆమె జీవించే ఉండి ఉంటుందన్న ఆశ అక్కడున్నవారెవరికీ లేదు.

తనను బంధించడానికి ఉపయోగించిన గొలుసులను ఆ రెండు వృక్షాలకు కట్టి లోయ లోపలికిదిగే ఏర్పాట్లు చేసుకున్నాడు విజయుడు.

లోయలోనికి దిగుతూ రాజనందిని ప్రణామం చేశాడు.

“ఆశీర్వదించండి మహారాణీ.”

“నా ఆశీర్వాదం నీకెప్పుడూ ఉంటుంది విజయా.”

తల్లి అతని మీద అభిమానం కురిపించడం సహించలేకపోయాడు రుద్రవర్మ. అక్కడున్న వారంతా వారికి తోచిన విధంగా సంభాషించుతున్నారు.

ఆ లోయలోకి అడుగిడిన వారెవ్వరూ తిరిగి రాలేదని అంతా విష సర్పాల మయమనీభయపడ్డారు. విజయుడున్న చోట విజయమేననీ, తప్పక విజయం సాధించుతాడన్న నమ్మకంవ్యక్తం చేశారు మరికొందరు.

రాజనందిని రుద్రవర్మవైఖరికి విముఖురాలై చూస్తూ ఉన్నది. ఆమె హృదయమంతా బాధతోనిండింది. కుమారుడిని సరైన మార్గంలో పెంచలేకపోయానన్న బాధ మనసులో నిండింది.

"ఆమెనలాగే వదిలి వేద్దామా? ఇదేనా రాజ్యాధికారుల లక్షణం. ప్రమాదానికి వెరిచే వారికిరాజ్యాధికారమెందుకు రుద్రా?" ఆమె కంఠంలో ఆక్రోశం విని కూడా నిర్లిప్తంగా నిలబడ్డాడురుద్రవర్మ.

తనతో వివాహం ఇష్టపడక ఆమె చేసిన అవమానం, రుద్రవర్మ మనసుని దహించివేస్తున్నది. తనకు బదులు మృత్యువునెంచుకున్నదంటే, రాజుగా తనని అవమానించినట్లే అనుకున్నాడు. క్రూర మృగాల బారిన పడి ఆమె వికృతమైన మరణం పొందాలి. ప్రతీకారంతో అతని మనసురగిలిపోతున్నది.

అతడిలో సాగుతున్న ఆలోచనలు పసిగట్టింది రాజనందిని.

“రుద్రా, ఒకరిని నమ్మిన స్త్రీ ,వేరొకరి చెంతనుండడానికెలా సిద్ధమవుతుంది? మనసులోవిజయుడిని కోరుకున్నది. అతడినే భర్తగా ఊహించుకున్నది. అంతే కానీ నీవంటే ఇష్టంలేకపోవడం కాదు.”

తల్లి మాటలు చెవిన బడనట్లు ముఖం కఠినంగా పెట్టుకుని చూస్తున్నాడు.

“ ఒకవేళ ఆమె ఇక్కడే నిలబడి ఉంటే, వివాహం జరిగి ఉండేది. ఆమె రాణి అయేది. కానీ ఆమెనిన్ను మోసం చేయలేక , తనని తాను అంతం చేసుకోవాలనుకున్నది. వారి ప్రేమనుగౌరవించు.”

“తల్లిగా మీరు నాకు చేసే న్యాయమిదేనా?”

“న్యాయానికి ఏ బంధాలు అంటకూడదు రుద్రా. అప్పుడే అది న్యాయమనిపించుకుంటుంది.”

సంధ్యా సమయమవుతున్నది. వివాహానికి తరలి వచ్చిన వారంతా మరలి వెళ్లడానికిసిద్ధమవుతున్నారు. రుద్ర వర్మ సైతం వారిద్దరూ మరణించి ఉంటారనుకుని తలచాడు.

నీల సిందూర వృక్షాలు ఎప్పటిలా ఉత్సాహంగా ఊగుతున్నాయి. వాటి కలకలానికి ఏమిటాకారణం అని అంతా లోయలోనికి చూశారు. విజయుడు గొలుసుల ఆధారంతో వసంతచంద్రికను తీసుకుని వస్తున్నాడు.

రుద్రవర్మ ఆగ్రహంతో ఊగిపోయాడు.

“వారిరువురూ మరలా నా రాజ్యంలో ప్రవేశించడానికి వీల్లేదు. వారిని హతమర్చండి.” అనిసైనికులకు ఆదేశాలిచ్చాడు.

సైనికులు ముందుకు కదలబోయారు.

"ఆగండి. వారికే హాని తలపెట్టినా వినాశం తప్పదు" సైనికులను వారించింది రాజనందిని.

"రుద్రా, చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశం జారవిడుచుకోకు. కోరి కోరి వినాశాన్నితెచ్చుకోవలదు" అని పలికింది.

"ఒక సైనికుడి కోసం కన్న కొడుకునే కాదనుకుంటున్నారు. మాతృత్వానికి విపరీతార్థాలు చెప్పేతల్లిని చూస్తున్నాను."

"తండ్రి చేసిన తప్పులకు నీ సోదరులంతా బలి అయ్యారు. నీ క్షేమం, రాజ్యక్షేమం కోసమే ఇలాచెయ్యవలసి వస్తున్నది."

"ఈ రాజ్యం నాది. దానినెలా రక్షించుకోవాలో నాకు తెలుసు"

కత్తి తీసుకుని విజయుని పైకి రానివ్వకుండా అడ్డుకోవాలని లోయవైపు వెళ్లబోయాడు రుద్రవర్మ.

అతనికి అడ్డంగా నిలబడింది రాజనందిని.

“తప్పులు చెయ్యడం ఆపాలి రుద్రా. నీ విజయాలకు కారకుడైన వీరుడి పట్ల ఇదేనా నువ్వుచూపే మర్యాదా?”

“మీరు అడ్డు తొలగకపోతే , తొలగించడానికి వెనుకాడను.” ఉగ్రంగా పలికాడు.

ఇంతలో ఆలయ ప్రాంగణమంతా వింత కాంతితో నిండింది. చూస్తున్న వారంతా కనులుమూసుకోవలసి వచ్చేంత ప్రకాశవంతంగా మారింది. అందరూ లోయలోనికి చూశారు.

నీల సిందూర వృక్షాలు రెండూ కనిపించనంత కాంతి నెలకొంది. కొంత సేపటికి అందరూఆశ్చర్య పడే రీతిన వృక్షాల స్థానంలో కేశవుడు, స్వర్ణ ముఖి నిలబడి ఉన్నారు. వారు అశరీరంగాఉన్నట్లు , వింత తేజస్సుతో వెలుగుతున్నట్లు చూసేవారికి అర్థమైంది.

నిర్ఘాంతపడి నిలబడిన రాజనందినికి నమస్కరించారు.

ప్రేమానురాగాలతో ఒకరికొకరు తోడుగా నిలబడి ఉన్న ఆ అపూర్వమైన జంటను చూస్తున్న వారికనులకు విందుగా ఉన్నది.

“మాకు మొక్కిన ఏ జంట ప్రేమనూ ఇప్పటివరకూ విఫలం చేయలేదు. వసంత చంద్రిక ఆ దేవివరప్రసాదిని. ఆ ప్రేమకు అండగా నిలబడిన మీకు సర్వదా కృతజ్ఞులం. మీ తల్లి మనసుకుదుఃఖ పెట్టినందుకు క్షమించండి " అన్నాడు కేశవుడు.

ఏమి సమాధానం చెప్పాలో తెలియక రాజనందిని కన్నీరు కార్చింది.

"స్వర్ణ ముఖి ఆగ్రహం వలన మీ నిస్వార్థమైన తల్లి మనసు వేదన చెందింది. మమ్మల్నిమన్నించండి. మీ కుమారులంతా క్షేమంగా ఉన్నారు" అంటూ లోయ నుండి , ఒక రథాన్ని పైకిరప్పించాడు.

అదృశ్యమైన ముగ్గురు కుమారులూ రథం నుండి దిగి తల్లి వద్దకు చేరారు.

వసంత చంద్రిక , విజయుల జంటను ఆశీర్వదించి

“ఎప్పటిలానే ఆ దేవిని ఆరాధించుకుంటూ, ఆలయంలో వచ్చే ప్రేమికులకు సహాయ పడుతూఉంటాము.” చేతులు జోడించి ప్రజలందరికీ అభివాదం చేసి లోయలోనికి వెళ్లారు. వింత కాంతి అదృశ్యమైంది.

నీల సిందూర వృక్షాలు ఎప్పటిలా  సంతోషంగా ఊగుతూ దర్శనమిచ్చాయి.

"స్త్రీ అయినా, సామ్రాజ్యమైనా అర్హుల చేతిలోనే అందం.

రాజ్యక్షేమానికి,  దేశ విజయాలకు కారణమైన విజయుడిని నా బిడ్డగా స్వీకరిస్తున్నాను. అతడే ఈదేశానికి రాజ్యాధినేత గా అర్హుడని ప్రకటిస్తున్నాను. రాజకుటుంబానికి చెందిన మహారాణి కిచెందిన ఆభరాణాలు ధరించిన వసంత చంద్రిక ఈ దేశపు మహారాణి అవుతుంది. వారిరువురివివాహం అయిన మరునాడే పట్టాభిషేకం."

రాజమాత నిర్ణయం ప్రజలందరిలోనూ సంతోషం నింపింది.

చూస్తున్న ప్రజలందరూ సంతోషంతో తమ హర్షాన్ని తెలియ జేశారు.

విజయుడూ, వసంత చంద్రికా ఆమెకు ప్రణమిల్లి ఆశీర్వాదం తీసుకున్నారు.

వధువు అలంకరణకూ , మహారాణి ఆభరణాలకూ న్యాయం జరిగిందన్న ఆనందంతోరాజనందిని మనసు సంతృప్తి చెందింది.

(సమాప్తం)

Post your comments